
# నజ్ముల్ అజేయ శతకం

**బంగ్లాదేశ్ ఆధిక్యం 205 • న్యూజిలాండ్‌తో తొలి టెస్టు**


నజ్ముల్ (104*)

ఢాకా: కొత్త సారథి నజ్ముల్ హుసేన్ శాంటో (104 బ్యాటింగ్; 10 ఫోర్లు) అజేయ సెంచరీతో కదంతొక్కడంతో.. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టులో బంగ్లాదేశ్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 310 పరుగులు చేయగా.. న్యూజిలాండ్ 317 పరుగులకు ఆలౌటైంది. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 4, మోమినుల్ హక్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా.. గురువారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. నజ్ముల్ హుసేన్ సూపర్ సెంచరీకి తోడు మోమినుల్ హక్ (40), ముష్ఫికర్ రహీమ్ (43 బ్యాటింగ్; 5 ఫోర్లు) ఆకట్టుకున్నారు. కివీస్ బౌలర్లలో ఏజాజ్ పటేల్ ఒక వికెట్ పడగొట్టాడు. చేతిలో ఏడు వికెట్లు ఉన్న బంగ్లాదేశ్ ప్రస్తుతం 205 పరుగుల ఆధిక్యంలో ఉంది. మిగిలిన ఏడు వికెట్ల సాయంతో బంగ్లా ఇంకెన్ని పరుగులు చేసి కివీస్ ముందు ఎంత లక్ష్యాన్ని నిర్దేశిస్తుందో చూడాలి.

# ఎనిమిది పతకాలు ఖాయం



న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్లు సత్తాచాటారు. ఎనిమిది మంది బాక్సర్లు సెమీఫైనల్‌కు చేరి పతకాలు ఖాయం చేసుకున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న పరి (50 కేజీలు), నిధి (66 కేజీలు) మరోసారి నిలకడైన ప్రదర్శన కనబర్చగా.. పాయల్ (48 కేజీలు), అమీశబూ (54 కేజీలు), నేహ (46 కేజీలు), ప్రాచి (54 కేజీలు) మహిళల విభాగంలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మొత్తం ఈ టోర్నీలో భారత్ నుంచి ఏడుగురు మహిళా బాక్సర్లు బరిలోకి దిగగా.. అందులో కేవలం జయశ్రీ దేవి (60 కేజీలు) మాత్రమే సెమీస్ చేరలేకపోయింది. బాలుర విభాగంలో.. నలుగురు భారత బాక్సర్లు బరిలోకి దిగగా.. అందులో ఇద్దరు సెమీఫైనల్లో అడుగుపెట్టి పతకాలు ఖాయం చేసుకున్నారు. హార్దిక్ పన్వర్ (80 కేజీలు), జతిన్ (54 కేజీలు) తమ ప్రత్యర్థులపై ఏకపక్ష విజయాలతో సెమీస్‌కు చేరారు.

# సెమీస్‌కు శివ, అమిత్



షిల్లాంగ్ : జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అమిత్ పంగల్(51కి.), ఆరుసార్లు ఆసియన్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న శివ థాపా, 2021 ఆసియన్ చాంపియన్ సంజీత్(92కి.) సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. థాపా బౌట్ ఆద్యంతం ప్రత్యర్థి శశాంక్ ప్రధాన్‌పై ఏకపక్షంగా ఆధిపత్యం ప్రదర్శించి విజయాన్నందుకున్నాడు. అమిత్ మహ్మద్ ఆరిఫ్‌పై గెలుపొంది అంకిత్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. సంజీత్ ఆర్ఎస్‌పిబికి చెందిన నమన్ తన్వర్‌పై విజయాన్ని సాధించి ఏకగ్రీవంగా గెలుపొందాడు. ఎస్ఎస్‌సిబికి చెందిన బరున్ సింగ్, పవన్, సచిన్, ఆకాశ్, వంశజ్, రజత్, ఆకాష్, దీపక్, లక్ష్య కూడా సెమీస్‌కు చేరుకున్నారు.

# ఇక్కడే పట్టాలి


శ్రేయస్

**నేడు భారత్, ఆస్ట్రేలియా నాలుగో టీ20.. రాత్రి 7.00 నుంచి**


సూర్యకుమార్

**పరుగుల వరద పారుతున్న పొట్టి సిరీస్‌లో మరో పోరుకు రంగం సిద్ధమైంది. గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో ఐదుసార్లు రెండొందల పైచిలుకు పరుగులు నమోదైన భారత్, ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో నేడు నాలుగో మ్యాచ్ జరగనుంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయం అనంతరం భారత జట్టు పొట్టి ఫార్మాట్‌లో దుమ్మురేపుతుంటే.. స్టార్లు స్వదేశానికి తిరిగి వెళ్లడంతో ఆస్ట్రేలియా కొత్తగా కనిపిస్తున్నది! శ్రేయస్ అయ్యర్ జట్టులో చేరడంతో యంగ్ ఇండియా బలం మరింత పెరగగా.. అతడి కోసం తెలంగాణ కుర్రాడు తిలక్‌వర్మపై వేటు వేస్తారా చూడాలి!**

రాయ్‌పూర్: వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని భారత జట్టు యువ ఆటగాళ్లకు అత్యధిక అవకాశాలు కల్పిస్తున్నది. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఇప్పటి వరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో టీమ్ఇండియా రెండు, ఆసీస్ ఒక మ్యాచ్ నెగ్గగా.. నేడు రాయ్‌పూర్ వేదికగా నాలుగో టీ20 జరగనుంది. గత మూడు మ్యాచ్‌ల్లోనూ భారత బ్యాటర్లు దంచికొట్టినా.. బౌలర్లు మాత్రం స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయారనే చెప్పాలి. ముఖ్యంగా డెత్ ఓవర్స్‌లో బౌలింగ్ చేయడంలో మనవాళ్లు పూర్తిగా విఫలమయ్యారు. వివాహం కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన ముఖేశ్ యాదవ్ రాకతో బౌలింగ్ పెరగడం ఖాయమే కాగా.. అసాధ్యం అనుకున్న సమయంలో అవలీలగా లక్ష్యాన్ని ఛేదించిన అరవీర భయంకర బ్యాటర్ మ్యాక్స్‌వెల్ ప్రస్తుత ఆసీస్ జట్టులో లేకపోవడం అభిమానులకు ఊరటనిచ్చే అంశం. వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులో అధిక శాతం మంది మెగాటోర్నీ ముగియగానే స్వదేశానికి వెళ్లగా.. మూడు మ్యాచ్‌లు ఆడిన అనంతరం మిగిలిన వాళ్లు కూడా వెళ్లిపోయారు. ప్రస్తుతం వరల్డ్‌కప్ ఫైనల్ ఆడిన జట్టులో సభ్యుడైన ట్రావిస్ హెడ్ మాత్రమే ఆసీస్ జట్టులో ఉన్నాడు. దీంతో కంగారూలు కూడా యంగ్ ప్లేయర్లను పరీక్షించాలని కోరుకుంటున్నది. గత మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ ఊచకోతతో కాస్తలో విజయానికి దూరమైన సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమ్ఇండియా.. ఈసారి ఎలాంటి పొరబాటు చేయకుండా సిరీస్ పట్టేయాలని భావిస్తుంటే.. మరోవైపు కంగారూలు మాత్రం సమం చేయాలని చూస్తున్నారు.

### బౌలింగ్ మెరుగవ్వాలి!

గత మ్యాచ్‌లను పరిశీలిస్తే.. భారత జట్టు డెత్ ఓవర్స్‌లో ప్రత్యర్థికి ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నది. మూడో టీ20లో ప్రసిద్ధ్ కృష్ణ నాలుగు ఓవర్లలో 68 పరుగులు ఇచ్చుకొని చెత్త రికార్డు మూటగట్టుకోగా.. మిగిలినవాళ్లు కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. అయితే గత మ్యాచ్‌కు బ్రేక్ తీసుకున్న ముఖేశ్ రాకతో కాస్త బలం పెరగడం ఖాయం కాగా.. అవేశ్, అర్ష్‌దీప్ ప్రసిద్ధ్ మరింత మెరుగవక తప్పదు. తొలి మూడు మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోయిన వరల్డ్‌కప్ హీరో శ్రేయస్ అయ్యర్ రాకతో తుది జట్టులో మార్పులు చోటు చేసుకోవడం ఖాయమే అనిపిస్తున్నది. సాధారణంగా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసే శ్రేయస్ కోసం హైదరాబాదీ తిలక్ తప్పుకోవాల్సి రావచ్చు. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్, రింకూసింగ్‌తో బ్యాటింగ్ లైనప్ బలంగానే కనిపిస్తున్నది. అయితే ఆసీస్ బౌలర్లలో బెహ్రెన్‌డార్ఫ్‌తో భారత లైనప్‌కు ముప్పు పొంచి ఉంది.

### ఆసీస్ కొత్త కొత్తగా..

సీనియర్ ఆటగాళ్లు స్వదేశానికి తిరిగి వెళ్లడంతో ఆస్ట్రేలియా కొత్తగా కనిపిస్తున్నది. వన్డే ప్రపంచకప్ మధ్యలో జట్టులో చేరిన ట్రావిస్ హెడ్ తప్ప మిగిలిన వాళ్లంతా వెళ్లిపోగా.. కొత్త ఆటగాళ్లకు అవకాశం దక్కింది. ఐపీఎల్ వేలానికి ముందు మంచి ప్రదర్శన చేసి ఫ్రాంచైజీల దృష్టిలో పడేందుకు వారికి ఇదో చక్కటి అవకాశం కానుంది. గువాహటిలో జరిగిన మూడో మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ వీర విధ్వంసంతో జట్టును గెలిపించి సిరీస్‌లో సజీవంగా నిలుపగా.. ఈ మ్యాచ్‌లోనూ అదే జోష్ కొనసాగించి సమం చేయాలని కంగారూలు చూస్తున్నారు. బ్యాటింగ్‌లో హెడ్ ఎంతటి విధ్వంసం సృష్టించగలడో ఇప్పటికే పలుమార్లు నిరూపించుకోగా.. అతడితో పాటు షార్ట్, టిమ్ డేవిడ్, వేడ్, గ్రీన్ కీలకం కానున్నారు. ఇక బౌలింగ్‌లో బెహ్రెన్‌డార్ఫ్ పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు.. భారత బ్యాటర్లకు సింహస్వప్నంలా నిలుస్తున్నాడు.


వేడ్


**5** ఈ సిరీస్‌లో ఆడిన ఆరు ఇన్నింగ్స్‌ల్లో ఐదు సార్లు 200 పైచిలుకు పరుగులు నమోదయ్యాయి.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** సూర్య (కెప్టెన్), యశస్వి, రుతురాజ్, ఇషాన్, శ్రేయస్/తిలక్, రింకూసింగ్, అక్షర్, రవి, అర్ష్‌దీప్/దీపక్, ప్రసిద్ధ్/అవేశ్, ముఖేశ్.
**ఆస్ట్రేలియా:** వేడ్ (కెప్టెన్), హెడ్, ఆరోన్, షార్ట్, మెక్‌డర్మొట్, టిమ్ డేవిడ్, గ్రీన్, డ్వార్షే, ఎలీస్, బెహ్రెన్‌డార్ఫ్, తన్వీర్.

### పిచ్, వాతావరణం

రాయ్‌పూర్ పిచ్ అటు బ్యాటింగ్‌కు ఇటు బౌలింగ్‌కు సమానంగా సహకరించనుంది. బౌండ్రీలు పెద్దవి కావడంతో పెద్ద షాట్లు కొట్టడం అంత సులభం కాదు. వాతావరణం సాధారణంగా ఉండనుంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.



## క్వార్టర్‌ఫైనల్లో ప్రియాంశు

లక్నో : సయ్యద్ మోడీ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో బరిలో మిగిలిన ఏకైక భారత ఆటగాడు ప్రియాంశు రజవత్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఈ యేడాది ఆర్లియన్స్ టోర్నీని గెలుచుకున్న ప్రియాంశు గురువారం స్వదేశానికే చెందిన సతీష్ కుమార్‌తో జరిగిన పోరులో 21-18, 11-6తో ముందంజలో ఉన్న సమయంలో ప్రత్యర్థి ఆటనుంచి తప్పుకోవడంతో ముందంజవేశాడు. మహిళల డబుల్స్‌లో కామన్వెల్త్ క్రీడల కాంస్య పతక జోడి గాయత్రి గోపిచంద్-త్రిషా జాలి కూడా ముందడుగు వేశారు. వారు 21-9, 21-5తో స్వదేశానికే చెందిన ధన్య నందకుమార్-రిధి కౌర్ తోర్‌పై సునాయాసంగా గెలుపొందారు.

## హర్మన్‌ప్రీత్‌కే పగ్గాలు



న్యూఢిల్లీ : డిసెంబర్ 15-22 తేదీల్లో స్పెయిన్‌లోని వాలెన్సియాలో జరిగే అయిదు దేశాల హాకీ టోర్నీలో పాల్గొనే భారత పురుషుల హాకీ జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యం వహించనున్నాడు. సుమిత్, రోహిదాస్ వైస్‌కెప్టెన్లుగా వ్యవహరిస్తారు. 2023-24 హాకీ ప్రొ లీగ్ సీజన్‌కు ఈ టోర్నీ సన్నాహకంగా ఉపయోగపడనున్నది. ఇండియాతోపాటు స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం జట్లు ఈ టోర్నీలో పాల్గొననున్నాయి. ఈ టోర్నీకోసం 24 మంది సభ్యుల జట్టును గురువారం ప్రకటించారు.

# ముగ్గురు సారథులు

**వన్డే, టీ20లకు రోహిత్, కోహ్లీకి విశ్రాంతి • టెస్టు సారథిగా హిట్‌మ్యాన్**

**రహానే, పుజారాకు బై బై • వన్డేలకు రాహుల్ కెప్టెన్సీ • దక్షిణాఫ్రికా టూర్‌కు భారత జట్ల ప్రకటన**


రాహుల్

**వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయాన్ని పక్కన పెట్టి ముందుకు సాగుతున్న టీమ్ఇండియా.. దక్షిణాఫ్రికా టూర్‌కు జట్లను ప్రకటించింది. పరిమిత ఓవర్ల (వన్డే, టీ20) సిరీస్‌కు సీనియర్లు రోహిత్, కోహ్లీకి విశ్రాంతినివ్వగా.. టెస్టు జట్టులో రహానే, పుజారాకు చోటు దక్కలేదు. టెస్టులకు రోహిత్ సారథ్యం వహించనుండగా.. వన్డే జట్టుకు కేఎల్ రాహుల్, టీ20లకు సూర్యకుమార్ కెప్టెన్‌లుగా కొనసాగనున్నారు. మూడు ఫార్మాట్ల కోసం దాదాపు వేర్వేరు జట్లను ప్రకటించిన బీసీసీఐ ముగ్గురు ప్లేయర్ల (శ్రేయస్, ముఖేశ్, రుతురాజ్)ను మాత్రం అన్ని జట్లకు ఎంపిక చేసింది. తెలంగాణ కుర్రాడు తిలక్ వర్మ టీ20, వన్డే జట్లలో చోటు దక్కించుకున్నాడు.**


రోహిత్

న్యూఢిల్లీ: గత కొంతకాలంగా విశ్రాంతి లేకుండా వరుస సిరీస్‌లు ఆడుతున్న టీమ్ఇండియా రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. దక్షిణాఫ్రికా పర్యటనలోని పరిమిత ఓవర్ల సిరీస్‌లకు దూరమయ్యారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న ఈ పర్యటనలో భాగంగా భారత జట్టు మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. దీని కోసం సీనియర్ సెలెక్షన్ కమిటీ గురువారం మూడు వేర్వేరు జట్లను ప్రకటించింది. స్వదేశంలో ఇటీవల జరిగిన వన్డే ప్రపంచకప్ అనంతరం నుంచి రోహిత్, కోహ్లీ సహా పలువురు ప్రధాన ఆటగాళ్లు విశ్రాంతిలో ఉండగా.. యువ భారత జట్టు ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడుతున్నది. సఫారీ టూర్‌లో మొదట పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఉండటంతో.. వాటి నుంచి కూడా తమను మినహాయించాలని రోహిత్, కోహ్లీ బోర్డును కోరడంతో.. మేనేజ్‌మెంట్ అంగీకరించింది. 'వరుస సిరీస్‌లతో బిజీగా ఉన్న రోహిత్ శర్మ ప్రస్తుతం లండన్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. పొట్టి ఫార్మాట్‌కు అతడు దూరమైనట్లే అనుకోవడం పొరబాటు. జట్టులో అతడిపై అపార గౌరవం ఉంది. శరీరానికి, మనసుకు రెస్ట్ కూడా అవసరమేగా' అని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు. దీంతో వన్డేలకు కేఎల్ రాహుల్, టీ20లకు సూర్యకుమార్ సారథులుగా వ్యవహరించనున్నారు. టెస్టులకు రోహిత్ శర్మ సారథ్యం వహించనుండగా.. జస్ప్రీత్ బుమ్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రోహిత్ గైర్హాజరీలో పొట్టి ఫార్మాట్‌కు హార్దిక్ పాండ్యా సారథ్యం వహించాల్సి ఉండగా.. అతడు గాయం కారణంగా దూరమైన విషయం తెలిసిందే. టీ20లకు రవీంద్రజడేజాను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

### శ్రీకర్ భరత్‌కు నో చాన్స్

భారత జట్టు ఇటీవల ఆడిన అన్నీ టెస్టు సిరీస్‌ల్లో భాగమైన తెలుగు వికెట్ కీపర్ బ్యాటర్ కోన శ్రీకర్ భరత్.. దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపిక కాలేదు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ప్రస్తుతం దేశంలో ఉన్న అత్యుత్తమ వికెట్ కీపర్‌గా మన్ననలు అందుకున్న భరత్‌కు సెలెక్టర్లు మొండి చేయి చూపారు. అతడి స్థానంలో కేఎల్ రాహుల్ టెస్టుల్లోనూ వికెట్ కీపర్‌గా కొనసాగనున్నాడు. వన్డేల్లో మాత్రమే వికెట్ల వెనుక విధులు నిర్వర్తిస్తున్న రాహుల్.. ఇకపై తెల్ల దుస్తుల్లోనూ కీపింగ్ చేయనున్నాడు. అతడికి రిజర్వ్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేసినా.. అతడికి తుది జట్టులో చోటు దక్కడం కల్లే! ఇక శ్రేయస్ అయ్యర్ చాన్నాళ్ల తర్వాత టెస్టు జట్టులోకి రాగా.. సీనియర్లు చతేశ్వర్ పుజారా, అజింక్యా రహానేకు చుక్కెదురైంది.

### రహానే, పుజారాకు నో చాన్స్!

సుదీర్ఘ కాలంగా భారత టెస్టు జట్టులో ప్రధాన ప్లేయర్లుగా కొనసాగుతున్న చతేశ్వర్ పుజారా, అజింక్యా రహానే కెరీర్ ముగిసినట్లేనా అంటే.. ఔననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో రాణించిన రహానేతో పాటు పుజారా జాతీయ జట్టు తరఫున చివరి టెస్టు ఆడేసినట్లే. పేలవ ఫామ్‌కు తోడు యువ ఆటగాళ్లతో పోటీ కారణంగా వీరికి జట్టులో చోటు దక్కలేదు. ఈ ఇద్దరి స్థానాలను శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ భర్తీ చేయనున్నారు. యశస్వి ఓపెనింగ్ చేస్తే గిల్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్ మిడిలార్డర్‌లో బరిలోకి దిగనున్నారు. ఇక మరోవైపు సీనియర్ పేసర్ ఉమేశ్ యాదవ్‌కు కూడా దాదాపు దారులు మూసుకుపోయినట్లే!

### జట్ల వివరాలిలా..

**టెస్టు:** రోహిత్ (కెప్టెన్), గిల్, యశస్వి, కోహ్లీ, శ్రేయస్, రుతురాజ్, ఇషాన్, కేఎల్ రాహుల్, అశ్విన్, జడేజా, శార్దూల్, సిరాజ్, ముఖేశ్, షమీ, బుమ్రా, ప్రసిద్ధ్.

**టీ20:** సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, గిల్, రుతురాజ్, తిలక్ వర్మ, రింకూ సింగ్, శ్రేయస్, ఇషాన్, జితేశ్, జడేజా, సుందర్, రవి, కుల్దీప్, అర్ష్‌దీప్, సిరాజ్, ముఖేశ్, దీపక్ చాహర్.

**వన్డే:** రాహుల్ (కెప్టెన్), రుతురాజ్, సాయి సుదర్శన్, తిలక్ వర్మ, రజత్ పాటిదార్, రింకూ సింగ్, శ్రేయస్, సంజూ శాంసన్, అక్షర్, సుందర్, కుల్దీప్, చాహల్, ముఖేశ్, అవేశ్, అర్ష్‌దీప్, దీపక్.

### భారత్ X దక్షిణాఫ్రికా షెడ్యూల్

| తేదీ | మ్యాచ్ | వేదిక |
|---|---|---|
| డిసెంబర్ 10 | తొలి టీ20 | డర్బన్ |
| 12 | రెండో టీ20 | గ్కెబ్రా |
| 14 | మూడో టీ20 | జొహన్నెస్‌బర్గ్ |
| 17 | మొదటి వన్డే | జొహన్నెస్‌బర్గ్ |
| 19 | రెండో వన్డే | గ్కెబ్రా |
| 21 | మూడో వన్డే | పార్ల్ |
| 26 నుంచి | తొలి టెస్టు | సెంచూరియన్ |
| జనవరి 3నుంచి | రెండో టెస్టు | కేప్‌టౌన్ |

# టీ20 ప్రపంచకప్‌నకు ఉగాండా



విన్‌ధోక్(నమీబియా) : వచ్చే యేడాది అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహించే టీ20 ప్రపంచకప్‌నకు ఉగాండా అర్హత సాధించింది. ఆఫ్రికా క్వాలిఫయర్ పోటీలలో రెండో స్థానంలో నిలిచి నమీబియాతో కలిసి ప్రపంచకప్‌నకు ఉగాండా అర్హత పొందింది. గురువారం ర్వాండాతో జరిగిన తమ చివరి పోరులో ఉగాండా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ర్వాండా 65 పరుగులకు ఆలౌట్ కాగా, సమాధానంగా ఉగాండా 8.1 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ప్రపంచకప్‌లో ఆడనున్న అయిదో ఆఫ్రికా దేశం ఉగాండా.

# స్టోక్స్ మోకాలికి శస్త్రచికిత్స



లండన్ : ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఎడమ మోకాలికి గురువారం శస్త్రచికిత్స నిర్వహించారు. వచ్చే యేడాది జనవరిలో ఇండియాతో జరుగనున్న సిరీస్‌కు ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు స్టోక్స్ శస్త్రచికిత్స చేయించుకున్నాడు. గత కొద్దికాలంగా స్టోక్స్ మోకాలి నొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల భారత్‌లో జరిగిన ప్రపంచకప్‌లో అతడు బ్యాటర్‌గానే పాలుపంచుకున్నాడు. ఇండియాతో అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జనవరి 25న హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నది. శారీరక శ్రమను తగ్గించుకునేందుకు స్టోక్స్ వచ్చే యేడాది ఐపీఎల్‌కు అందుబాటులో ఉండనని ప్రకటించిన విషయం తెలిసిందే.

# భారత్ ఘనవిజయం



శాంటియాగొ(చిలీ) : మహిళల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత జూనియర్ జట్టు 12-0తో కెనడాను చిత్తుగా ఓడించింది. ఆరంభం నుంచి దూకుడును ప్రదర్శించిన భారత్‌కు అన్ను (4,6,39ని.), దీపి మోనిక టొప్పొ (21ని.), ముంతాజ్ ఖాన్ (26,41,54, 60ని.), దీపిక సొరెంగ్ (34,50,54ని.), నీలమ్(45ని.) గోల్స్ సాధించారు. భారత జట్టు తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం జర్మనీని ఢీకొంటుంది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.